# ప్రైవేట్‌కు స్వాగతం.. ప్రభుత్వ సంస్థలకు వీడ్కోలు

- పక్క రాష్ట్రాలకు ప్రభుత్వరంగం
- విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంలో ప్రభుత్వ విధానమిది
- ఇతర రాష్ట్రాల్లో జెన్‌కో, సింగరేణి పెట్టుబడులు..
- తెలంగాణలో ప్రైవేట్ సంస్థల పెట్టుబడులకు ఎంవోయూ
- విద్యుత్తు విషయంలో తిరోగమన దిశలో సర్కారు



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ఎవరి స్థలంలో వాళ్లు ఇల్లు కట్టుకోవడం సహజం. అదే మన స్థలం మరెవరికో ఇచ్చి, మనం వెళ్లి పక్కవాళ్ల స్థలంలో ఇల్లు కట్టుకుంటే ఎలా ఉంటుంది? విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంది. మన రాష్ట్రంలో కొత్త విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని ప్రైవేట్‌కు కట్టబెడుతున్నది. మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలైన జెన్‌కో, సింగరేణి ద్వారా ఇతర రాష్ట్రాల్లో ప్లాంట్లు ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తున్నది. మన దగ్గర ప్రైవేట్ ప్లాంట్లకు గేట్లు తెరిచి, మన విద్యుత్తు సంస్థల చేత రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యుత్తు ప్లాంట్లను నిర్మిస్తున్నది. ప్రభుత్వ తీరును విద్యుత్తురంగ నిపుణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇదేం పద్ధతి అంటూ ప్రశ్నిస్తున్నారు.

**జెన్‌కో, సింగరేణితో ఇతర రాష్ట్రాల్లో పనులు**

విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం, నిర్వహణ విషయంలో జెన్‌కో, సింగరేణి సంస్థలు ఆరితేరాయి. జెన్‌కో థర్మల్, హైడల్ విద్యుత్తు ప్లాంట్లు నిర్మించగా.. సింగరేణి థర్మల్, సోలార్ ప్లాంట్లను నిర్మించడంతోపాటు రామగుండంలో కొత్తగా పంప్‌స్టోరేజీ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టింది. ఈ రెండు సంస్థలను కాదని ప్రభుత్వం కొత్త పవర్ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రైవేట్‌కు కట్టబెడుతున్నది. ఆ రెండు సంస్థల చేత రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో కొత్త ప్లాంట్లు పెట్టిస్తున్నది. ప్రభుత్వ సంస్థలతో సొంత రాష్ట్రాన్ని వదిలి ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టించడం ఎందుకో.. దీని వెనుకున్న మతలబేమిటోనని నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ఇతర రాష్ట్రాల్లో మనంపెట్టేవి..**

- టీజీ జెన్‌కో హిమాచల్‌ప్రదేశ్‌లో బిల్డ్ ఆపరేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) పద్ధతిలో జలవిద్యుత్తు కేంద్రం (హైడల్) నిర్మాణానికి సంప్రదింపులు జరుపుతున్నది.
- సింగరేణి సంస్థ రాజస్థాన్‌లో 3,100 మెగావాట్ల విద్యుత్తు పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ఎంవోయూలు కుదుర్చుకుంది. 1600 మెగావాట్ల థర్మల్, 1,500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను నెలకొల్పనుంది.
- సింగరేణి సంస్థ ఒడిశాలోని నైనీలో 1, 600 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పనుంది.

**మన రాష్ట్రంలోకి ప్రైవేట్ పెట్టుబడులు**

- సన్ పెట్రోకెమికల్స్ సంస్థ రూ.45 వేల కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నది. ఈ సంస్థ నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఈ సంస్థ 3,400 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది.
- మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ 11వేల కోట్ల పెట్టుబడులతో 2,160 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ పవర్‌ప్లాంట్లను నెలకొల్పనుంది.
- మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ మరో 3వేల కోట్లను రాష్ట్రంలో పెట్టుబడి పెట్టి, వెయ్యి మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ (బీఈఎస్ఎస్) ప్లాంట్‌ను నెలకొల్పనుంది.
- మైత్రా ఎనర్జీ సంస్థ 7వేల కోట్లు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ సంస్థ 2,400 మెగావాట్ల సోలార్ సెల్, మరో 2,400మెగావాట్ల సోలార్ మాడ్యూల్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్‌ను నెలకొల్పనుంది.

## హడావిడిగా పాలసీ.. అందుకేనా

క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ఇటీవలే గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందించింది. ఈ పాలసీకి క్యాబినెట్‌లో ఆమోదం లభించింది. అయితే దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు రంగంలో 66 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకున్నది. దావోస్ సదస్సుకు ముందే సర్కారు గ్రీన్ ఎనర్జీ పాలసీని తీసుకొచ్చింది. తాజాగా వచ్చిన పెట్టుబడులన్నీ గ్రీన్ ఎనర్జీ రంగానికి సంబంధించినవే. అంటే దావోస్ సదస్సుకు ముందే పాలసీ రూపొందించడం వెనుక ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానించాలన్న ముందస్తు కుట్ర దాగి ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి. హడావిడిగా పాలసీ రూపకల్పన వెనుక ఇదే కోణం దాగి ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# పక్షులు చనిపోతే సమాచారం ఇవ్వాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎక్కడైనా విపరీతంగా పక్షులు చనిపోతే వెంటనే 9100797300 వాట్సాప్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని పశు సంవర్ధక శాఖ కోరింది. ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా అనుమానిత కేసులతో రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

# రుణగ్రహీతలకు ఎస్బీఐ శుభవార్త

**ఈబీఎల్ఆర్, ఆర్ఎల్ఎల్ఆర్ రుణాలపై వడ్డీరేటు తగ్గింపు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణగ్రహీతలకు శుభవార్తను అందించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్-బేస్డ్ లెండింగ్ రేటు(ఈబీఎల్ఆర్), రెపో లింక్డ్ లెండింగ్ రేటు(ఆర్ఎల్ఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను పావు శాతం మేర తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. దీంతో గృహ, వ్యక్తిగత రుణాలతోపాటు ఇతర రుణాలపై చెల్లించే ఈఎంఐలు తగ్గనున్నాయి. ఈ నూతన రేట్లు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. రిజర్వుబ్యాంక్ ఇటీవల రెపోరేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఎస్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఈబీఎల్ఆర్ రేటు పావు శాతం తగ్గించడంతో రేటు 9.15 శాతం నుంచి 8.90 శాతానికి దిగొచ్చింది. అలాగే ఆర్ఎల్ఎల్ఆర్ కూడా 8.50 శాతానికి దించింది. ఆర్బీఐ విధించిన రెపోరేటు ఆధారంగా బ్యాంకులు దీనికి అనుగుణంగా రుణాలపై వడ్డీరేట్లను నిర్ణయిస్తుంటాయి. సెంట్రల్ బ్యాంక్ గతవారంలో రెపోరేటును తగ్గించడంతో బ్యాంకులు ఒక్కొక్కటి రుణాలపై వడ్డీరేటును తగ్గిస్తున్నాయి. ఎస్బీఐ కూడా ఈ నిర్ణయం తీసుకున్నది. కానీ, మార్జినల్ కాస్ట్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్), బేస్‌రేటు, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు(బీపీఎల్ఆర్)ని యథాతథంగా ఉంచింది బ్యాంక్.

**ఎస్బీఐకి రూ.30 కోట్లు**

తెలంగాణకు చెందిన రిఫైనరీ కంపెనీ శీతల్ రిఫైనరీస్ లిమిటెడ్, మరికొన్ని సంస్థల రుణ మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రూ.30 కోట్లకుపైగా విలువైన ఆస్తులను రికవరీ చేసి ఎస్బీఐకి అప్పగించింది.

**మరిన్ని బ్యాంకులు కూడా..**

ఎస్బీఐ బాటలోనే మరిన్ని బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాయి. వీటిలో కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లు ఉన్నాయి. దీంట్లో కెనరా బ్యాంక్ ఆర్ఎల్ఎల్ఆర్‌తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటును 9.25 శాతం నుంచి 9 శాతానికి దించింది. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా బీఆర్ఎల్ఎల్ఆర్ వడ్డీరేటును 8.90 శాతానికి దించింది. ఈ వడ్డీరేట్లు ఈ నెల 10 నుంచే అమలులోకి వచ్చాయి. అలాగే ఈ నెల 7 నుంచి అమలులోకి వచ్చేలా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎల్ఎల్ఆర్ రేటుని 9.35 శాతం నుంచి 9.10 శాతానికి తగ్గించింది. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ కూడా 9.10 శాతానికి తగ్గించగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా రెపోతో అనుసంధానమై రుణాలపై వడ్డీరేటును 9.25 శాతం 9 శాతానికి తగ్గించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సైతం ఆర్ఎల్ఎల్ఆర్ వడ్డీరేటును 9 శాతానికి కోత పెట్టింది.

## స్విఫ్ట్, డిజైర్ కార్లు ప్రియం

**రూ.10 వేల వరకు పెంచిన సంస్థ**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ మరో రెండు మాడళ్ల ధరలను పెంచింది. దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన స్విఫ్ట్, డిజైర్ సెడాన్ ధరలను రూ.10 వేల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇటీవ మార్కెట్లోకి విడుదల చేసిన నాలుగో జనరేషన్ డిజైర్‌ను కూడా పెంచేసింది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో స్విఫ్ట్ రూ.5 వేల వరకు అధికంకానుండ గా, డిజైర్ రూ.10 వేల వరకు ప్రియంకానున్నది. ఉత్పత్తి వ్యయం అధికం కావడం వల్లనే ధరలను పెంచాల్సి వచ్చిందని సంస్థ పేర్కొంది. దీంతో డిజైర్ రూ.6.84 లక్షల నుంచి రూ.9.99 లక్షల లోపు, స్విఫ్ట్ రూ.6.49 లక్షల నుంచి రూ.9.5 లక్షల లోపు లభించనున్నది.

# సెక్షన్‌వారీగా మ్యాపింగ్

**ఐటీ శాఖ వెబ్‌సైట్‌లో కొత్త బిల్లు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపుదారులు పాత ఐటీ చట్టం 1961లోని సెక్షన్లతో కొత్త ఐటీ బిల్లు 2025లోని క్లాజులను సరిపోల్చుకునే అవకాశాన్ని ఐటీ శాఖ కల్పించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల దాదాపు 65 ఏండ్ల ఐటీ చట్టం స్థానంలో నూతన ఐటీ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పాతదాంట్లో సెక్షన్లుంటే.. కొత్తదాంట్లో వాటికి బదులుగా కొన్ని క్లాజులను ప్రతిపాదించారు. దీంతో ఏ సెక్షన్.. ఏ క్లాజుగా మారిందో తెలియక ట్యాక్స్‌పేయర్స్ గందరగోళంలో పడిపోయారు. నిజానికి కొత్త ఆదాయ పన్ను విధానాన్ని ఎంచుకొనేవారికి ఈ సెక్షన్లతో ఎలాంటి పనీ లేదు. కానీ పాత ఆదాయ పన్ను విధానాన్ని అనుసరించేవారికి సెక్షన్లు తప్పనిసరి. వయసు ఆధారంగా గరిష్ఠంగా ఆయా పొదుపు, పెట్టుబడులు, ఖర్చులు, చెల్లింపులపై రూ.11 లక్షల నుంచి 15 లక్షలదాకా పన్ను మినహాయింపు ప్రయోజనాలను పొందవచ్చు మరి. దీంతో కొత్త ఐటీ చట్టంలో కీలకమైన సెక్షన్లను క్లాజులుగా మార్చడంతో ట్యాక్స్‌పేయర్స్ ఐటీ రిటర్నుల సమయంలో ఇబ్బందిపడే ప్రమాదం ఏర్పడుతున్నది. దీనిపైన అటు ట్యాక్స్‌పేయర్స్ నుంచి ఇటు ఎక్స్‌పర్ట్స్ నుంచి ఆందోళనలు, విమర్శలూ వెల్లువెత్తాయి. ఇక ఇప్పటికే పాత ఆదాయ పన్ను విధానం జోలికి వెళ్లకుండా ప్రతీ బడ్జెట్‌లో కొత్త ఆదాయ పన్ను విధానంలోనే సవరణలు చేస్తూ వస్తున్న మోదీ సర్కారు.. పాత ఆదాయ పన్ను విధానానికి పూర్తిగా చరమగీతం పాడేందుకే ఈ కొత్త ఐటీ బిల్లు, సెక్షన్ల మార్పు చేపట్టిందన్న ఆరోపణలూ వచ్చాయి. ఈ క్రమంలోనే సెక్షన్ టు క్లాజ్ అర్థం చేసుకునేలా ఐటీ శాఖ వెబ్‌సైట్‌లో పాత ఆదాయ పన్ను చట్టంతో కొత్త ఆదాయ పన్ను బిల్లును మ్యాపింగ్ చేస్తూ అప్‌లోడ్ చేశారు. పాత ఐటీ చట్టాన్ని సరళతరం చేస్తామని కొత్త ఐటీ బిల్లును ఈ నెల 13న లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఇందులో 2.60 లక్షల పదాలు, 536 సెక్షన్లు, 23 చాప్టర్లు, 57 టేబుళ్లున్నాయి. అలాగే ట్యాక్స్ ఇయర్ విధానాన్ని పరిచయం చేశారు. ప్రస్తుత చట్టంలో ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై), మదింపు సంవత్సరం (ఏవై)గా ఉండగా, వీటిని ట్యాక్స్ ఇయర్‌గా మార్చారు. ఏప్రిల్ 1 నుంచి మార్చి 31దాకా ఈ సంవత్సరాన్ని పరిగణిస్తారు. లోక్‌సభ సెలెక్ట్ కమిటీ, పార్లమెంట్‌ల ఆమోదం పొందితే వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త ఐటీ బిల్లు అమల్లోకి రానున్నది.

## బజాజ్ కన్జ్యూమర్ కేర్ చేతికి
# విశాల్ పర్సనల్ కేర్

**డీల్ విలువ రూ.120 కోట్లు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న విశాల్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ముంబై ఆధారిత బజాజ్ కన్జ్యూమర్ కేర్ లిమిటెడ్ సొంతం చేసుకుంటున్నది. రెండు విడుతల్లో జరుగనున్న ఈ డీల్ విలువ రూ.120 కోట్లుగా అంచనా వేస్తున్నారు. విశాల్ పర్సనల్ కేర్‌లో తొలుత 49 శాతం వాటాను, ఆ తర్వాత మిగతా 51 శాతం వాటాను బజాజ్ కన్జ్యూమర్ కేర్ కొనుగోలు చేయబోతున్నది. ఇక విశాల్ పర్సనల్ కేర్‌లో 2012లో ప్రైవేట్ ఈక్విటీ సంస్థ పీపుల్ క్యాపిటల్ పెట్టుబడులు పెట్టింది. ఇప్పుడు ఈ వాటాలనూ బజాజ్ కన్జ్యూమర్ కేర్ కొనాల్సి ఉన్నది. కాగా, ప్రస్తుతం మార్కెట్‌లో బంజారా బ్రాండ్ పేరిట వివిధ శిరోజ, చర్మ సంరక్షణ ఉత్పత్తులను విశాల్ పర్సనల్ కేర్ విక్రయిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజా లావాదేవీ పూర్తయితే ఈ బ్రాండ్ బజాజ్ కన్జ్యూమర్ కేర్ గూటికి వెళ్లిపోనున్నది. 'ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో బజాజ్ కన్జ్యూమర్ కేర్ వ్యాపార కార్యకలాపాల బలోపేతానికి విశాల్ పర్సనల్ కేర్ కొనుగోలు వ్యూహాత్మకంగా కలిసిరాగలదు' అని ఈ సందర్భంగా బజాజ్ కన్జ్యూమర్ కేర్ ఎండీ జైదీప్ నంది అన్నారు. శుక్రవారం జరిగిన తమ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో విశాల్ పర్సనల్ కేర్ కొనుగోలుకు ఆమోదం లభించినట్టూ ఆయన చెప్పారు. ఇక గత ఆర్థిక సంవత్సరం (2023-24) విశాల్ పర్సనల్ కేర్ రెవిన్యూ రూ.51 కోట్లుగా ఉన్నది. దీన్ని 1991లో స్థాపించారు. హెర్బల్ పౌడర్లు, అలోవెరా జెల్స్, షాంపూలు, హెయిర్ కేర్ పౌడర్లు అమ్ముతున్నది. ఏపీ, తెలంగాణసహా ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో దీనికి 70వేలకుపైగా ఔట్‌లెట్లున్నాయి. ఇదిలావుంటే కుషగ్ర బజాజ్ నేతృత్వంలోని 2.5 బిలియన్ డాలర్ల విలువైన బజాజ్ గ్రూప్‌లోగల ఎఫ్ఎంసీజీ కంపెనీయే బజాజ్ కన్జ్యూమర్ కేర్. గత ఆర్థిక సంవత్సరం దీని ఆదాయం రూ.967.71 కోట్లు, లాభం రూ.158.77 కోట్లుగా ఉన్నది. బజాజ్ ఆల్మండ్ డ్రాప్స్ ఆయిల్, కోకోనట్ ఆయిల్, సబ్బులు, సీరమ్స్, షాంపూలు, కండీషనర్లను అమ్ముతున్నది. ఇక ఈ డీల్‌తో ఉత్తరాది మార్కెట్లలో బంజారా బ్రాండ్‌ను విస్తృతపర్చాలని బజాజ్ భావిస్తున్నది.

## గుట్టు చప్పుడు కాకుండా పాప విక్రయం

చెన్నారావుపేట, ఫిబ్రవరి15: పసిపాపను గుట్టుచప్పుడు కాకుండా విక్రయించిన ఘటన మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన దంపతులకు ఇప్పటికే ఇద్దరు కుమారులు. పదిహేను రోజుల క్రితం వీరికి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడ శిశువు జన్మించింది. ఈ నేపథ్యంలో ఎవరికీ తెలియకుండా డబ్బులు తీసుకుని పాపను విక్రయించినట్లు తెలిసింది. శిశువులను విక్రయించే మధ్యవర్తులు గ్రామానికి చేరుకొని పాపను తీసుకెళ్లినట్లు తెలిసింది.

## నర్సంపేటలో వ్యక్తి అదృశ్యం

నర్సంపేట, ఫిబ్రవరి15: నర్సంపేట పట్టణంలోని నెక్కొండ రోడ్‌లో ఓవ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. నెక్కొండ రోడ్డు ప్రాంతానికి చెందిన పోలబోయిన శ్రవణ్‌కుమార్ ఈనెల 9న భార్యతో గొడవపడ్డాడు. మరుటి రోజు ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా శ్రవణ్‌కుమార్ వెళ్లిపోయాడు. ఈక్రమంలో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో శనివారం శ్రవణ్‌కుమార్ కుమారుడు పోలబోయిన వినయ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

## ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

పర్వతగిరి, ఫిబ్రవరి 15: మండలంలోని కల్లెడలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై మాట్లాడారు. ఈకార్యక్రమంలో మహారాష్ట్ర బంజారా సేన అధ్యక్షుడు బాబుసింగ్ చౌన్ మహారాజ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు పాల్గొన్నారు.

## వెలమ సంక్షేమ సంఘం గ్రామకమిటీ ఎన్నిక

పర్వతగిరి, ఫిబ్రవరి 15: మండలంలోని చింతనెక్కొండ గ్రామ వెలమ సంక్షేమ సంఘం కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లెపాటి రాంచందర్‌రావు, గౌరవాధ్యక్షుడిగా చెవులపెల్లి చలపతిరావు, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మోహన్‌రావు, సుధీర్‌రావు, కోశాధికారిగా దేవేందర్‌రావు, జూలపెల్లి వేంకటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు.

## ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

పర్వతగిరి, ఫిబ్రవరి 15: మండలంలోని ఆకేరు శివారులోని కల్లెడ, రోళ్లకల్, నారాయణపురం, చెరువుముందు తండాలోని అక్రమ ఇసుక డంపులను శనివారం స్థానిక ఎస్సై బోగం ప్రవీణ్, ప్రొబెషనరీ ఎస్సై కల్యాణ్, ఆర్ఐ భారతి సందర్శించారు. ఆకేరు వాగులో, రైతుల పట్టా భూముల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు.

## తలనీలాలను మాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి, ఫిబ్రవరి 15: అన్నారం యాకూబ్ బాబాకు భక్తులు సమర్పించిన తలనీలాలను మాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం స్థానికులు సంబంధిత అధికారులను కోరారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, సూపరింటెండెంట్‌తో పాటు స్థానిక క్షురకుడితో కుమ్మక్కై లక్షలాది రూపాయల తల నీలాలను మాయం చేస్తున్నారని వారు ఆరోపించారు. 2022-23 సంవత్సరానికి రూ.28 లక్షలకు శ్రీనివాస్‌రావుకు వేలంలో ఖరారు చేయగా, 2023 నుంచి టెండర్ నిర్వహించకుండా దర్గా ఇన్‌స్పెక్టర్, సూపరింటెండెంట్, స్థానిక క్షురకుడితో కుమ్మక్కై మహిళల తలనీలాలు కాజేస్తూ, వక్ఫ్ బోర్డుకు ఆదాయం గండి కొడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

## మత్స్యకారుడి వలకు చిక్కిన కొండచిలువ

సంగెం, ఫిబ్రవరి 15 : చెరువులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు వలలో కొండచిలువ చిక్కడంతో షాక్ అయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన మత్స్యకారుడు బయ్య సారంగం శుక్రవారం సాయంత్రం మొండ్రాయి చెరువులో చేపల వేటకు వెళ్లి వలలు వేశాడు. శనివారం ఉదయం వలలను తీయడానికి వెళ్లగా బరువుగా కనిపించింది. వలను పైకి తీయగా అందులో సుమారు 17 అడుగుల కొండ చిలువ చనిపోయి కనిపించింది.

# దెబ్బ తిన్న రహదారులకు మరమ్మతు చేయాలి : కలెక్టర్

వెంకటాపురంలో దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

నెక్కొండ, జనవరి 15 : భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను కోరారు. శనివారం మండలంలోని వెంకటాపురంలో గత సంవత్సరం భారీ వర్షాలకు కల్వర్టు వద్ద రోడ్డు కొట్టుకుపోయి ఆర్టీసీ బస్సు వరదల్లో చిక్కుకుపోయిన ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చేసిన మరమ్మతు పనులను, అదే ప్రాంతానికి కొద్ది దూరంలో ఉన్న మరోకల్వర్టును పరిశీలించి తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ డీఈ రమాదేవిని ఆదేశించారు. నెక్కొండ- నర్సంపేట మార్గంలో వాగుసమీపంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి మరమ్మతులు చేయాలని కోరారు. ఇదిలా ఉండగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్) ప్రాజెక్ట్‌లో ప్రతిపాదిత రోడ్లను జిల్లా కలెక్టర్‌కు ఆర్‌అండ్‌బీ అధికారులు వివరించారు. వెంకటాపురం సమీపంలో రాకపోకలకు అంతరాయం కలిగిన రెండు లోలెవల్ కాజ్‌వేలను ,రోడ్డు ఆనకట్టపై వేసిన పైపులను పరిశీలించి వెంటనే బీసీ సర్ఫేసింగ్ చేయాలని కలెక్టర్ కోరారు. హనుమకొండ- నర్సంపేట, నర్సంపేట-మహబూబాబాద్‌రోడ్డు, పాకాల రోడ్డుకు మరమ్మతులు ప్రతిపాదించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బీ డీఈ రమాదేవి,ఏఈ గోపి ఉన్నారు.

## వారం రోజుల్లో కొత్త ఎఫ్ఎస్‌టీపీ ప్రారంభించాలి

**మేయర్ గుండు సుధారాణి**

అమ్మవారిపేటలోని మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్, ఫిబ్రవరి 15 : స్మార్ట్‌సిటీ నిధులతో నూతనంగా నిర్మించిన 150 కేఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎఫ్ఎస్‌టీపీలో వారం రోజుల్లో మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్రారంభించాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. శుక్రవారం అమ్మవారిపేటలోని ఎఫ్ఎస్‌టీపీని సందర్శించారు. అక్కడ మానవ వ్యర్థాల శుద్ధీకరణ తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మించిన ఎఫ్ఎస్‌టీపీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షన్-2025 పోటీల్లో భాగంగా స్వచ్ఛత విధానాలు పాటించాలన్నారు. అమ్మవారిపేటలోని రెండు ఎఫ్ఎస్‌టీపీ కేంద్రాలను నిరంతరం నడిపించాలన్నారు. ఇళ్ల నుంచి సేకరించిన మానవ వ్యర్థాల ను నేరుగా ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్లకు తలించాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్లు, క్లీనర్లు మానవ వ్యర్థాలను బహిరంగ ప్రాంతాల్లో డంప్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వాహన మరమ్మతులు చేపట్టాలి

వరంగల్, ఫిబ్రవరి 15 : షెడ్‌లో ఉన్న వాహనాల మ రమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. శనివా రం బాల సముద్రంలోని వె హికిల్ షెడ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరమ్మతులు చేయాల్సిన వాహనాలతో పాటు షోరూం వర్క్‌షాపులకు తరలించిన భారీ వాహనాల వివరాలు అందించాలన్నారు. వెహికల్ షెడ్‌లో నిరుపయోగంగా పడి ఉన్న వాహనాలపై ఆరా తీశారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఈఈ మహేందర్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, ఏఈ ఫణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

## నిషేధిత పొగాకు ఉత్పత్తుల పట్టివేత

కరీమాబాద్, ఫిబ్రవరి 15: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పొగాకు ఉత్పత్తులను నిల్వ ఉంచిన ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. శివనగర్‌లోని ఓ ఇంటిలో సుమారు రూ.36,250 విలువ గల నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

నర్సంపేట, ఫిబ్రవరి15: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన పట్టణంలోని మహబూబాబాద్ రోడ్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణానికి చెందిన గుండేటి రామస్వామి (71) సర్వాపురం శివారు నర్సంపేట-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

## విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

**అదనపు కలెక్టర్ సంధ్యారాణి**

సంగెం, ఫిబ్రవరి 15 : బట్టి పట్టి చదవకుండా ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి విద్యార్థులకు సూచించారు. మండలంలోని మొండ్రాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల పేరెంట్స్, టీచర్స్‌తో సమావేశాన్ని హెచ్ఎం విజయ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎలా ఉంది అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గణితంలో తాను వెనుకబడగా మా నాన్న గారు టీచర్ కావడంతో నేర్పించారని గుర్తు చేసుకున్నారు. ఎంపీడీవో రవీందర్, పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ అనుముల శ్రీలత, కార్యదర్శి రమేశ్, సీఆర్‌పీ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ, ఎంపీటీసీ తుది ఓటర్ల జాబితా విడుదల

ఖిలావరంగల్, ఫిబ్రవరి 15: జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను అదనపు డీఈఏ రాంరెడ్డి విడుదల చేశారు. 11 మండలాల్లో 11 జడ్పీటీసీలు, 130 ఎంపీటీసీ స్థానాలకు 694 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 3,85,163 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,89,070 మంది, మహిళలు 1,96,083 మంది, 10 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి చేయూత

నెక్కొండ, ఫిబ్రవరి 15 : ఆపదలో ఉన్న వారితోపాటు పూర్వం కలిసి చదువుకున్న వారు మృతి చెందితే వారి కుటుంబాలకు స్నేహితులు అండగా నిలుస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004 సంవత్సరంలో పదో తరగతి చదివిన పొరండ్ల రాజు ఇటీవల అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో బాల్యంలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు స్పందించి రూ.41 వేలను మృతుడి కుటుంబానికి శనివారం అందించారు. మృతుడి కూతురు దీవెన పేరిట స్థానిక పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

## అద్వైత్‌రాజ్‌కు బెస్ట్ మెమోరీ కిడ్ అవార్డు

అవార్డుతో అద్వైత్‌రాజ్

సంగెం, ఫిబ్రవరి 15 : మండలంలోని గవిచర్లకు చెందిన బస్కె రాజు-అరుణ దంపతుల కుమారుడు బస్కె అద్వైత్‌రాజ్ ఇండియా బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. న్యూఢిల్లీలోని ఫరిదాబాద్‌లో శనివారం జరిగిన ఇండి యా బుక్‌ఆఫ్ రికార్డ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అద్వైత్‌రాజ్ జ్ఞాపకశక్తిలో అత్యంత ప్రతిభ కనబరిచి బెస్ట్ మెమోరీ కిడ్ అవార్డును అందుకున్నాడు. బాలుడు 195 దేశాల పేర్లు వాటి రాజధానులు, జాతీయ జెండాలు, కరెన్సీ వివరాలను తక్కువ సమయంలో చెప్పి అబ్బురపర్చాడు. అవార్డు అందుకున్నందుకు తల్లితండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## హార్‌దిన్ లక్‌పతి విజేతగా అజ్మీరా అద్విన్

నర్సంపేట, ఫిబ్రవరి15: ప్రముఖ టెలివిజన్ క్విజ్ షో కౌన్ బనేగా కరోడ్‌పతి ఎపిసోడ్‌లో అజ్మీరా అద్విన్ లక్‌పతి విజేతగా నిలిచాడు. మండలంలోని చంద్రయ్యపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని బుచ్చినాయక్‌తండాకు చెందిన అద్విన్ తన అద్భుతమైన విజ్ఞానంతో విజేతగా నిలిచాడు. ఈషోలో పాల్గొన్న అద్విన్ ఒక్కో ప్రశ్నకు సమాధానం చెబుతూ ప్రతిభచూపాడు. అద్విన్ మాట్లాడుతూ ఈగేమ్ షోలో పాల్గొనడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. భవిష్యత్తులో మరింతగా రాణించేందుకు తనకు ప్రేరణగా ఉంటుందని పేర్కొన్నారు.

INDRA VENKATARAMANA PADMAVATHI - KACHIGUDA
MUKTA A2 RAMAKRISHNA 70MM - ABIDS
TARAKARAMA CINEPLEX - KACHIGUDA
MAHALAXMI - KOTHAPET | SREERAMANA DIGITAL - AMBERPET | PRASADS MULTIPLEX - NTR GARDENS | AMB CINEMAS - GACHIBOWLI | PVR - INOX CINEMAS: - NEXUS MALL - KUKATPALLY | IRRUM MANZIL - KHAIRTABAD|INORBIT MALL - MADHAPUR | PRESTON PRIME - GACHIBOWLI | ICON - HITECH CITY | R.K.COMPLEX - BANJARAHILLS | PLAY HOUSE HYDERABAD NEXT GALLERIA - PUNJAGUTTA | HYDERABAD NEXT GALLERIA - MOOSRAMBAGH | CENTRAL MALL - PUNJAGUTTA | PRISM MALL - GACHIBOWLI | ATRIUM MALL- GACHIBOWLI | GVK MALL - BANJARAHILLS | MAHESHWARI PARMESHWARI MALL - KACHIGUDA | GSM MALL - MIYAPUR | ASHOKA ONE MALL - KUKATPALLY | SATTVA NECKLACE MALL - KAVADIGUDA | MIRAJ CINEMAS : SHALINI SHIVANI - DILSUKHNAGAR | CENTRAL MALL - BALANAGAR | RAGHAVENDRA - MALKAJGIRI | CINETOWN - MIYAPUR | JP CINEMAS - CHANDANAGAR | CINEPOLIS: MANTRA MALL - ATTAPUR | LULU MALL - KUKATPALLY | DSL MALL - UPPAL | CCPL - MALKAJGIRI | SUDHA - SHALIBANDA | TNR NORTH CITY - KOMPALLY | ASIAN CINEMAS: CINESQUARE - UPPAL | RADHIKA - KAPRA | M CUBE MALL - ATTAPUR | MJR SQUARE - NARAPALLY | SHIVAGANGA - DILSUKHNAGAR | CINEPLANET - KOMPALLY | GPR - KUKATPALLY | LAXMIKALA CINEPRIDE - MOOSAPET | SHA SHEHANSHA - HMT ROAD CHINTAL | MUKTA A2 SENSATION - KHAIRTABAD | SWAPNA - KATEDAN | CINEMART - R.C.PURAM | CINETOWN INDRA / NAGENDRA - KARMANGHAT | J PRASAD MULTIPLEX - MADANIGUDA | TIVOLI CINEMAS - SEC'BAD | APARNA CINEMAS - NALLAGANDLA | AAA CINEMAS - AMEERPET | PLATINUM MOVIE TIME - GACHIBOWLI | PLATINUM MOVIE TIME - AMEERPET | MOVIEMAX AMR MALL - SECUNDERABAD | MOVIE TIME CINEMAS SKYMALL - ERRAGADDA X ROADS